క్లుప్తంగా

ఘనంగా సుదర్శన హోమం



సుదర్శన హోమం చేస్తున్న భక్తులు

పెదగంట్యాడ: జీవీఎంసీ 65వ వార్డు పరిధిలోని వాంబే కాలనీలోని వైకుంఠ వేంకటేశ్వర స్వామి ఆలయంలో గురువారం సుదర్శన యాగం నిర్వహించారు. సుదర్శనుల వారి తిరునక్షత్ర దినోత్సవాన్ని పురస్కరించుకొని ఈ యాగం నిర్వహించారు. కార్యక్రమంలో మంత్రి మంజుల, దొడ్డి రమణ, భువనేశ్వరి శర్మ, భవాని ప్రసాద్, ఉషారాణి, హిమజ తదితరులు పాల్గొన్నారు.

విభిన్న ప్రతిభావంతుల ఒలింపిక్స్‌లో రాజేష్ ప్రతిభ



రాజేష్‌ను అభినందిస్తున్న అతిథులు

పెదగంట్యాడ: విభిన్న ప్రతిభావంతుల ఒలింపిక్స్‌లో నడుపూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థి వి.రాజేష్ సత్తా చాటాడు. బిలాస్పూర్‌లో ఇటీవల నిర్వహించిన బోషి అనే ఈ పోటీలలో వ్యక్తిగత విభాగంలో ఐదో స్థానంలో నిలిచాడు. రాష్ట్ర స్థాయిలో ప్రథమ స్థానంలో నిలిచిన ఈ విద్యార్థికి ప్రత్యేకంగా శిక్షణ ఇచ్చి జాతీయ స్థాయి పోటీలకు పంపించారు. ఈ మేరకు పాఠశాలలో గురువారం అభినందన సభ నిర్వహించారు. ఆ విద్యార్థిని 75వ వార్డు కార్పొరేటర్ పులి లక్ష్మీబాయి, పాఠశాల హెచ్‌ఎం రాచకొండ శ్రీనివాస్, పుష్పాంజలి, రూప, శ్రీనివాస్, ఉపాధ్యాయులు అరుణ, భవానీ శంకర్, వరలక్ష్మి, రజని, రత్నాయమ్మ, నరసింహ, రమేష్ నాయుడు, శివ తదితరులు పాల్గొన్నారు.

ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో సేవా కార్యక్రమాలు



అర్హుడికి ఆర్థిక సాయం అందజేస్తున్న సభ్యులు

గాజువాక : శ్రావణమాసం సందర్భంగా గాజువాక ఆర్యవైశ్య సంఘం సభ్యులు గురువారం వివిధ సేవా కార్యక్రమాలు నిర్వహించారు. పాత గాజువాకలోని వాసవీ కన్యకా పరమేశ్వరి అమ్మవారి ఆలయంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో తొలుత వేద ఆశీర్వచనం నిర్వహించారు. వాసవీ మాత అమ్మవారి ఆలయ పూజారి తల్లికి బైపాస్ సర్జరీ కోసం రూ.13వేల ఆర్థిక సాయం అందజేశారు. ఆలయం అభివృద్ధి కోసం సంఘం సభ్యులనుంచి విరాళాలను సేకరించారు. సభ్యులు స్క్రాచ్ కార్డు ద్వారా విరాళాలను అందజేశారు. కార్యక్రమంలో సంఘం నాయకులు పీపీఎస్ నాగేశ్వరరావు, ఏవీఎస్ఎన్ గుప్త, కులుకూరి మంగరాజు, కేశారపు సతీష్, కేసారపు శ్రీను రమేష్ తదితరులు పాల్గొన్నారు.

స్టీల్‌ప్లాంట్ కాంట్రాక్టర్లపై పోలీసులకు ఫిర్యాదు



ఫిర్యాదు పత్రాలతో కాంట్రాక్ట్ కార్మికులు

ఉక్కునగరం: తమకు న్యాయం చేయాలంటూ స్టీల్‌ప్లాంట్ కాంట్రాక్ట్ కార్మికులు గురువారం స్టీల్‌ప్లాంట్ పోలీస్ స్టేషన్‌ను ఆశ్రయించారు. మే 20న అఖిలపక్ష కాంట్రాక్ట్ కార్మిక సంఘాల పిలుపు మేరకు జరిగిన సమ్మెలో తాము పాల్గొన్నందుకు ఎటువంటి ముందస్తు నోటీసు లేకుండానే పనుల నుంచి తొలగించారని వారు ఫిర్యాదులో పేర్కొన్నారు. రెండు నెలలుగా ఈ అంశంపై ఉక్కు యాజమాన్యం ప్రతినిధులను, కాంట్రాక్టర్లను అడిగినా తమకు సంబంధం లేదని బుకాయిస్తున్నారని కార్మికులు ఆవేదన వ్యక్తం చేశారు. కార్మిక సంఘాల నాయకుల చుట్టూ తిరిగినప్పటికీ తమకు న్యాయం జరగలేదని వాపోయారు. తాము 2016 నుంచి పనిచేస్తున్నామని, ఈ క్రమంలో ఇంజినీరింగ్ ఇన్‌చార్జీలు, కాంట్రాక్టర్లు తమ వద్ద రూ. 3 లక్షల నుంచి రూ. 4 లక్షల వరకు లంచాలు వసూలు చేశారని కార్మికులు ఆరోపించారు. ఉద్యోగాల నుంచి తొలగించినప్పుడు తమకు ఫుల్ అండ్ ఫైనల్ సెటిల్‌మెంట్ కూడా చెల్లించలేదని తెలిపారు. తమకు రావాల్సిన ఫుల్ అండ్ ఫైనల్ చెల్లింపులు, అలాగే తాము కట్టిన లంచం డబ్బులు ఇప్పించాలని కార్మికులు పోలీసులను కోరారు. దీనిపై స్పందించిన స్టీల్‌ప్లాంట్ సీఐ కేశవరావు, సంబంధిత కాంట్రాక్టర్లను పిలిచి మాట్లాడతానని తెలిపారు.

చారిత్రాత్మక క్షణం

స్టీల్‌ప్లాంట్‌లో కొలువుదీరనున్న

ఏకలవ్యుడు

- ఆగస్టు 9 విగ్రహావిష్కరణ
- ఉక్కుమంత్రి, జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యుల హాజరు

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్‌లో గిరిజన ఉద్యోగుల ఆరాధ్యదైవం ఏకలవ్యుని విగ్రహం ప్రతిష్ఠించాలనే చిరకాల కోరిక అతి త్వరలో నెరవేరనుంది. ఆగస్టు 9న ప్రపంచ ఆదివాసీ దినోత్సవం సందర్భంగా ఈ విగ్రహాన్ని ఆవిష్కరించేందుకు సన్నాహాలు జరుగుతున్నాయి. స్టీల్‌ప్లాంట్ యాజమాన్యం దేశ స్వాతంత్ర్య సమరయోధులు, రాష్ట్ర అవతరణ నాయకులు,



పార్కు సుందరీకరణ పనులు



సిద్ధం చేస్తున్న ఏకలవ్యుని విగ్రహం

స్టీల్‌ప్లాంట్ ఏర్పాటు కోసం ప్రాణాలర్పించిన అమరవీరుల గౌరవార్థం ఉక్కునగరంలోని ప్రధాన మార్గాల్లో ప్రత్యేక పార్కులు, వాటిలో విగ్రహాలు ఏర్పాటు చేసింది. ఇందులో భాగంగా సెక్టార్–1లో 2001 ఏప్రిల్ 14న ఏకలవ్య పార్కును ఏర్పాటు చేశారు. అప్పటి నుంచి గిరిజన ఉద్యోగులు ఈ పార్కులో ఏకలవ్యుని విగ్రహాన్ని ప్రతిష్ఠించాలని కోరుతున్నారు. గతంలో స్టీల్‌ప్లాంట్‌లో 23 ఎస్సీ, ఎస్టీ సంఘాలు ఉండటం, వాటి మధ్య అనైక్యత కారణంగా ఈ సమస్య పెండింగ్‌లో పడింది. 2006లో జాతీయ ఎస్సీ, ఎస్టీ కమిషన్ సభ్యులు వి. దేవేందర్ ప్లాంట్‌ను సందర్శించి, సంఘాల మధ్య



నిర్మాణ పనుల్లో కార్మికులు



ఏకలవ్య పార్కు ముఖద్వారం

ఐక్యత లేమిని గుర్తించారు. ఒక్క సంఘాన్నే గుర్తించాలని యాజమాన్యాన్ని ఆదేశించారు. అప్పటి నుంచి జరిగిన ఆరు గుర్తింపు సంఘాల ఎన్నికల్లోనూ ఏకలవ్యుని విగ్రహం ఏర్పాటు హామీగానే మిగిలిపోయింది.

ప్రస్తుత గుర్తింపు సంఘం యాజమాన్యంపై తీవ్ర ఒత్తిడి తీసుకురావడంతో పాటు, జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యులు హుస్సేన్ కూడా యాజమాన్యానికి ఆదేశాలు జారీ చేశారు. ఈ ఒత్తిడితో యాజమాన్యం అంగీకరించి విగ్రహాన్ని సిద్ధం చేసింది. అంతేకాకుండా, పార్కును ఆధునీకరించడంతో పాటు సుందరీకరణ పనులు చేపట్టింది. పిల్లల ఆట వస్తువులు, జిమ్ కూడా ఏర్పాటు చేస్తున్నారు. కేంద్ర ఉక్కు మంత్రి హెచ్‌డీ కుమారస్వామి, జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యులు జాతోటి హుస్సేన్ చేతుల మీదుగా ఈ విగ్రహాన్ని ఆవిష్కరించేందుకు ఏర్పాట్లు జరుగుతున్నాయి. ఇది గిరిజన ఉద్యోగుల దీర్ఘకాల స్వప్నాన్ని నెరవేర్చడమే కాకుండా, ఉక్కు నగరంలో వివిధ వర్గాల వారసత్వాన్ని గౌరవించడంలో మరో ముందడుగుగా నిలుస్తుంది.

యాజమాన్యం సహకారం మరువలేనిది...



ఎన్నికల ముందు తాము ఇచ్చిన హామి మేరకు ఏకలవ్యుని విగ్రహం ఏర్పాటుపై ఉక్కు యాజమాన్యాన్ని పలుమార్లు కోరా. దానికి యాజమాన్యం అంగీకరించి నిధులు ఇవ్వటంతో ఏర్పాటుకు సన్నాహాలు జరగుతున్నాయి. ఇందుకు సహకరించిన ఉక్కు యాజమాన్యం ప్రతినిధులకు కృతజ్ఞతలు.

– బయ్యే మల్లయ్య, ప్రధానకార్యదర్శి, స్టీల్‌ప్లాంట్ ఎస్సీ, ఎస్టీ అసోసియేషన్

డెయిరీ యాజమాన్యంపై చర్యలకు డిమాండ్



పాదయాత్రలో పాల్గొన్న నాయకులు

గాజువాక : విశాఖ డెయిరీలో 300 మంది కార్మికులను తొలగించడం పట్ల యాజమాన్యంపై ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని సీపీఎం జిల్లా కార్యదర్శి ఎం.జగ్గునాయుడు డిమాండ్ చేశారు. ఈ విషయంలో ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ జోక్యం చేసుకోవాలని కోరారు. తొలగించిన కార్మికులను వెంటనే విధుల్లోకి తీసుకోవాలని డిమాండ్ చేస్తూ సీఐటీయూ ఆధ్వర్యంలో గురువారం పాత గాజువాకలో పాదయాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తొలగించినవారిలో 200 మంది మహిళా కార్మికులున్నారన్నారు. కార్మికులను తొలగించి 48 రోజులైందని, అయినప్పటికీ ప్రభుత్వం గాని, ప్రజా ప్రతినిధులుగాని వారికి న్యాయం చేయడంలేదని అన్నారు. 30 ఏళ్లుగా పని చేస్తున్న కార్మికులు ఇప్పుడు పనుల్లేక రోడ్డుపై పడ్డారన్నారు. గతంలో జరిగిన ఒప్పందాన్ని అమలు చేయాలని కోరినందుకు ఉద్యోగాలనుంచి తొలగించడం దారుణమన్నారు. ఈ సమస్యపై యాజమాన్యం చర్చల పేరుతో కాలయాపన చేస్తోందన్నారు. సమస్యను వెంటనే పరిష్కరించి కార్మికులను విధుల్లోకి తీసుకోవాలని, లేనిపక్షంలో రాష్ట్ర వ్యాప్త ఆందోళన చేస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో నాయకులు ఎం.రాంబాబు, డి.రమణ, రాజేంద్ర ప్రసాద్, జి.రాము, కె.సంతోషం, శ్రీదేవి, ఎం.మధు నాయుడు, కె.పద్మ, విజయ, అనసూయ తదితరులు పాల్గొన్నారు.

‘సంక్షేమ వసతి గృహాల బాట’ను

అడ్డుకుంటే ఉద్యమం ఉధృతం



వంటలను రుచి చూస్తున్న చైతన్య, నాయకులు

- వైఎస్సార్ స్టూడెంట్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు పానుగంటి చైతన్య
- లంకెలపాలెం వసతి గృహాన్ని సందర్శించిన వైఎస్సార్‌సీపీ నేతలు

అగనంపూడి : సంక్షేమ వసతి గృహాల్లోని విద్యార్థుల సమస్యలను తెలుసుకోవడానికి వెళ్లకుండా తమను అడ్డుకుంటే, ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని వైఎస్సార్ స్టూడెంట్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు పానుగంటి చైతన్య ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ప్రభుత్వం ఎంత నిర్బంధిస్తే అంతగా ముందుకు దూసుకుపోతామని ఆయన స్పష్టం చేశారు. జిలా అధ్యక్షుడు బొడ్డపల్లి హేమంత్ ఆధ్వర్యంలో 79వ వార్డు లంకెలపాలెంలోని వెనుకబడిన తరగతుల వసతి గృహాన్ని సందర్శించిన సందర్భంగా వారు మాట్లాడారు. వసతి గృహాల్లో విద్యార్థుల పరిస్థితి అత్యంత దయనీయంగా ఉందని, కనీసం పడుకోవడానికి పరుపులు లేకపోగా, దుప్పట్లు, చాపలు కూడా సరఫరా చేయలేని దుస్థితిలో ప్రభుత్వం ఉందని చైతన్య ఆవేదన వ్యక్తం చేశారు. వైఎస్సార్‌సీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి ఆదేశాలతో వైఎస్సార్ స్టూడెంట్స్ యూనియన్ చేపట్టిన ‘సంక్షేమ వసతి గృహాల బాట’ కార్యక్రమం కూటమి ప్రభుత్వానికి కంటగింపుగా మారిందన్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఈ కార్యక్రమం ఉద్యమంలా సాగుతుండటంతో ప్రభుత్వం ఉలిక్కిపడి ఎక్కడికక్కడ అడ్డుకునే ప్రయత్నాలు చేస్తోందని చైతన్య ఆరోపించారు. విద్యార్థులను కలుసు కోవడానికి విద్యార్థి సంఘాలకు ఎవరి అనుమతులూ అవసరం లేదని, ప్రభుత్వం తమను అడ్డుకోవడం మానేసి విద్యార్థుల సమస్యల పరిష్కారంపై దృష్టి సారిస్తే మంచిదని హితవు పలికారు. కార్యక్రమంలో 85వ వార్డు వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు జి. పూర్ణానందశర్మ (పూర్ణ), నాయకులు సుందరపు అప్పారావు, కర్రి నరసింగరావు, గెంజి సురేష్, అనకాపల్లి నియోజకవర్గం అధ్యక్షుడు రాయ్‌రాజు, హరి, హేమంత్, మురళీ తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులతో ముచ్చటిస్తున్న చైతన్య, పూర్ణ, హేమంత్



సమస్యలు తెలుసుకుంటున్న స్టూడెంట్స్ యూనియన్ బృందం

విద్యార్థులకు మెరిట్ స్కాలర్‌షిప్‌ల అందజేత

పెదగంట్యాడ: బిగ్ హెల్ప్ ఫర్ ఎడ్యుకేషన్ సంస్థ వ్యవస్థాపకుడు షేక్ చాంద్‌బాషా మాదిరిగానే ప్రతి ఒక్కరూ క్రమశిక్షణతో, ప్రణాళికాబద్ధంగా చదువుకుని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని 75వ వార్డు కార్పొరేటర్ పులి లక్ష్మీభాయ్ పిలుపునిచ్చారు. లక్ష్యం లేని విద్య నిష్ఫలమని, విద్యార్థి దశలోనే ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకోవాలని ఆమె సూచించారు. నడుపూరు ఉన్నత పాఠశాలలో గురువారం జరిగిన కార్యక్రమంలో, బిగ్ హెల్ప్ ఫర్ ఎడ్యుకేషన్ సంస్థ మంజూరు చేసిన మెరిట్ స్కాలర్‌షిప్‌లను కార్పొరేటర్ లక్ష్మీభాయ్ తన చేతుల మీదుగా 10 మంది విద్యార్థులకు అందజేశారు. ఈ స్కాలర్‌షిప్‌ల కింద ఒక్కో విద్యార్థికి రూ. 300 నుంచి రూ. 1000 వరకు నగదు ప్రోత్సాహం లభించింది. అలాగే జూన్ నెలకు సంబంధించి షేక్ చాంద్ బాషా అందించిన విద్యా సామాగ్రిని కూడా ఈ సందర్భంగా పంపిణీ చేశారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రాచకొండ, పాఠశాల సిబ్బంది ఇందిరా, కల్యాణి, రవి, శివ, రమేష్, నాయుడు తదితరులు పాల్గొన్నారు.



మెరిట్ స్కాలర్‌షిప్ అందుకున్న విద్యార్థులతో కార్పొరేటర్ పులి లక్ష్మీభాయ్

గెడ్డల్లో పేరుకుపోయిన వ్యర్థాలు



పూడికతో నిండిన గెడ్డ



ఐటీఐ సమీప గెడ్డలో వ్యర్థాలు

పెదగంట్యాడ: పలు ప్రాంతాల్లో గెడ్డలు, డ్రైనేజీలు చెత్తాచెదారం, వ్యర్థాలతో నిండిపోయి తీవ్ర దుర్వాసన వెదజల్లుతున్నాయి. అధికారులు పట్టించుకోవడం లేదని స్థానికులు వాపోతున్నారు. జీవీఎంసీ 65వ వార్డు పరిధిలోని వికాస్‌నగర్, ఐటీఐ గేటు ఎదురుగా ఉన్న చిన్న గెడ్డ పరిస్థితి దారుణంగా ఉంది. ఈ గెడ్డ చెత్తాచెదారం, వ్యర్థాలతో నిండిపోవడంతో మురుగునీరు పారక, తీవ్ర దుర్వాసన వెదజల్లుతోంది. కొన్ని చోట్ల గెడ్డ ఆక్రమణకు గురై సన్నబడటంతో, అంచులను ఆక్రమించి నివాసాలు నిర్మించడం వల్ల పారిశుద్ధ్య కార్మికులకు చెత్తను తొలగించడం కష్టంగా మారింది. దీంతో పూర్తిస్థాయిలో చెత్తను తొలగించలేని పరిస్థితి నెలకొందని, ఇదే అదునుగా తీసుకుని కార్మికులు కూడా శుభ్రం చేయడం మానేశారని స్థానికులు చెబుతున్నారు. నెలల తరబడి పూడికలు తీయకపోవడంతో ఐటీఐ విద్యార్థులు, ఉపాధ్యాయులు, స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇక్కడ పేరుకుపోయిన చెత్త వద్దకు పందులు చేరి పరిసరాలను మరింత అస్తవ్యస్తం చేస్తున్నాయి. అదే విధంగా, వినాయకనగర్‌లోని చైతన్య కళాశాలను ఆనుకుని ఉన్న గెడ్డలో పేరుకుపోయిన చెత్త, మురుగు నుంచి వస్తున్న దుర్వాసనతో పరిసర ప్రాంతాల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా శానిటరీ అధికారులు స్పందించి, గెడ్డలు, కాలవల్లో పూడికలు ఎప్పటికప్పుడు తొలగించి, ప్రజలను రోగాల బారి నుంచి కాపాడాలని ప్రజలు కోరుతున్నారు.

అధికార పార్టీలో చిచ్చు రాజేసిన భూ ఆక్రమణలు

- ‘సాక్షి’ కథనంతో కూటమి నేతల్లో చర్చ
- టీడీపీ నేతల మధ్య నలిగిపోతున్న అధికారులు

కూర్మన్నపాలెం : కూర్మన్నపాలెంలో కోట్లాది రూపాయల విలువైన ప్రభుత్వ భూమి ఆక్రమణలు అధికార తెలుగుదేశం పార్టీలో అంతర్గత కలహాలకు దారితీశాయి.పార్టీకి చెందిన కొందరు నాయకులు రాత్రికి రాత్రే రేకుల షెడ్లు నిర్మించి, భూమిని సొంతం చేసుకోవడానికి పథకం వేయడంతో ఈ వివాదం మొదలైంది. ఈ ఆక్రమణలపై ‘భూచోరులు’ శీర్షికతో సాక్షిలో గురువారం కథనం ప్రచురించడంతో టీడీపీలోని మరో వర్గం తీవ్రంగా స్పందించింది. 86వ వార్డు కార్పొరేటర్ లేళ్ల కోటేశ్వరరావు స్వయంగా ఆక్రమణ జరుగుతున్న ప్రాంతానికి చేరుకుని ఆక్రమణదారులపై కన్నెర్ర జేశారు. నిర్మాణ పనులను వెంటనే నిలిపివేయాలని ఆగ్రహం వ్యక్తం చూస్తూ అక్కడున్న కూలీలను పంపించివేశారు. భూమిని చదును చేస్తున్న జేసీబీని కూడా అక్కడి నుంచి తరలించి, మొత్తం నిర్మాణ పనులను నిలిపివేశారు. అక్కడ పనిచేస్తున్నవారు అధికార పార్టీ ప్రజాప్రతినిధి పేరు చెప్పినా కార్పొరేటర్ కోటేశ్వరరావు లక్ష్యపెట్టలేదు. ‘తక్షణమే పనులు ఆపివేసి ఎవరి ఇళ్లకు వారు వెళ్లిపోవాలి. లేకపోతే పరిణామాలు తీవ్రంగా ఉంటాయి’ అని ఆయన హెచ్చరించారు. దీంతో చేసేది లేక కూలీలు, ఆక్రమణదారులు అక్కడి నుంచి వెళ్లిపోయారు. అనంతరం మీడియాతో మాట్లాడిన లేళ్ల కోటేశ్వరరావు, కూర్మన్నపాలెంలోని సర్వే నంబర్ 27 భూమి ప్రభుత్వానికి చెందినదని స్పష్టం చేశారు. గతంలో ఆ భూమిని కాపాడటానికి ప్రహరీ కూడా నిర్మించినట్లు తెలిపారు. ‘కోట్ల విలువ చేసే ప్రభుత్వ భూమిని తమకు తెలియకుండా ఆక్రమిస్తే ఎలా సహిస్తాం?’ అని ప్రశ్నించారు. ఎట్టి పరిస్థితుల్లోనూ ఆక్రమణలను ప్రోత్సహించేది లేదని, ఎవరికైనా సరైన డాక్యుమెంట్లు ఉంటే తనను సంప్రదించవచ్చని ఆయన చెప్పారు.



ఆక్రమణలు అడ్డుకొంటున్న కార్పొరేటర్

బయటపడ్డ టీడీపీ వర్గ విభేదాలు

ఈ భూ ఆక్రమణల వ్యవహారం తెలుగుదేశం పార్టీలోని వర్గ విభేదాలను మరోసారి బట్టబట్టలు చేసింది. ఒక వర్గం ఆక్రమణలకు కొమ్ముకాస్తుంటే, మరో వర్గం వాటిని అడ్డుకుంటోంది. దీంతో ప్రణాళిక, రెవెన్యూ విభాగాల అధికారులు ఎటూ తేల్చుకోలేక, చర్యలు తీసుకోలేక సతమతమవుతున్నారు. అధికారులు ఫోన్‌లకు కూడా స్పందించకుండా తప్పించుకుంటున్నారు. ప్రస్తుతం ఆక్రమణకు గురవుతున్న భూమి సుమారు మూడు ఎకరాల వరకు ఉంటుందని అధికారులు అంచనా వేస్తున్నారు. ఆ ప్రాంతం భారీ భవనాలతో ప్రణాళికాబద్ధమైన కాలనీగా అభివృద్ధి చెందడం వల్ల చదరపు గజం ధర రూ.50 వేలకు పైగానే పలుకుతోందని సమాచారం. ఈ లెక్కన ఆ భూమి విలువ కోట్లలో ఉంటుందని స్థానికులు చెబుతున్నారు. అందువల్లే అధికార పార్టీకి చెందిన పెద్ద తలకాయలు తెరవెనుక ఈ తతంగం నడిపిస్తున్నారని బలమైన ఆరోపణలు ఉన్నాయి. అందుకే అధికారులు చూస్తాం, చేస్తాం అంటూ కాలయాపన చేస్తున్నారని తెలుస్తోంది. ఇప్పటికే ఆ భూమిలో ఆరు షెడ్లు నిర్మించగా, మరో నాలుగు నిర్మాణంలో ఉన్నాయి. మొత్తం స్థలాన్ని చదును చేసేందుకు ఏర్పాట్లు చేయగా, కార్పొరేటర్ అడ్డుకోవడంతో ఆ పనులు నిలిచిపోయాయి. ఇప్పుడు ఆక్రమణలకు కొమ్ముకాసే వర్గం ఎలాంటి ఎత్తుగడలు వేస్తుందో వేచి చూడాలి.



జేసీబీని బయటకు పంపించేస్తున్న దృశ్యం

దాడి ఘటనలో మరో నిందితుడి అరెస్టు

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ బీసీ గేటు వద్ద మొల్లి సంతోష్‌కుమార్‌పై జరిగిన దాడి కేసులో స్టీల్‌ప్లాంట్ పోలీసులు మరో నిందితుడిని అరెస్ట్ చేశారు. ఈ నెల 25న జరిగిన ఈ దాడిలో మొత్తం 12 మంది సంతోష్‌కుమార్‌ను తీవ్రంగా గాయపరిచారు. ఈ కేసులో ఆరుగురు నిందితులను ఈ నెల 27న అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపరచగా, వారికి 14 రోజుల రిమాండ్ విధించారు. మిగిలిన నిందితుల కోసం గాలింపు చేపట్టగా, మరో ముగ్గురిని జూలై 30న అరెస్ట్ చేశారు. తాజాగా, ఈ కేసులో ఎ12గా ఉన్న అప్పికొండ యశ్వంత్ మణికంఠను గురువారం వెంపలి నగర్‌లోని అతని నివాసం వద్ద అదుపులోకి తీసుకున్నారు. అనంతరం కోర్టులో హాజరుపరచగా 11వతేదీ వరకు రిమాండ్ విధించినట్లు స్టీల్‌ప్లాంట్ పోలీసులు తెలిపారు.

మింది హైస్కూల్‌లో గ్రంథాలయం ప్రారంభం

గాజువాక : కోరమాండల్ ఫెర్టిలైజర్స్ సంస్థ తమ కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ (సీఎస్సార్) నిధులతో మింది జిల్లా పరిషత్ హైస్కూల్‌లో ఏర్పాటు చేసిన గ్రంథాలయాన్ని గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు గురువారం ప్రారంభించారు. 68వ వార్డు కార్పొరేటర్ గుడివాడ అనూష లతీష్ మాట్లాడుతూ ఈ ప్రాంతంలో అనేక పరిశ్రమలున్నప్పటికీ కోరమాండల్ ఫెర్టిలైజర్స్ మాత్రమే వార్డు అభివృద్ధికి అన్ని విధాలా సహకరిస్తోందన్నారు. కార్యక్రమంలో కోరమాండల్ ఫెర్టిలైజర్స్ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ ఎం.జ్ఞాన సుందరం, వివిధ విభాగాల అధికారులు నారాయణ, జయగోపాల్, శ్రీనివాసరావు, నాగరాజు, వెంకట రమణ తదితరులు పాల్గొన్నారు.

గాజువాక హైస్కూల్‌లో.. : కోరమాండల్ ఆర్థిక సహకారంతో గాజువాక హైస్కూల్‌లో ఏర్పాటు చేసిన గ్రంథాలయాన్ని ఎమ్మెల్యే శ్రీనివాసరావు ప్రారంభించారు. డీఈవో ఎన్.ప్రేమ్ కుమార్ , పాఠశాల హెచ్‌ఎం విజయ ప్రశాంతి, కార్పొరేటర్ పల్లా శ్రీనివాసరావు, డీసీఎంఎస్ మాజీచైర్‌పర్సన్ పల్లా చినతల్లి, ఎంఈవోలు విశ్వనాథం, సునీత, కోరమాండల్ అధికారులు పాల్గొన్నారు.



మింది హైస్కూల్‌లో గ్రంథాలయాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే శ్రీనివాసరావు, కార్పొరేటర్ అనూష

యువకుల రక్తదానం

గాజువాక : గాజువాకకు చెందిన పలువురు యువకులు గురువారం స్వచ్ఛంద రక్తదానం చేశారు. తమ మిత్రుడు జన్మదినం సందర్భంగా స్థానిక వెంకీ బాయ్స్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ శిబిరంలో యువకులు 500 యూనిట్ల రక్తం దానం చేశారు. ఈ కార్యక్రమాన్ని గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు, జీవీఎంసీ డిప్యూటీ మేయర్ దల్లి గోవిందరెడ్డి ప్రారంభించారు. ఎన్టీఆర్, వందేభారత్, అమ్మ బ్లడ్ బ్యాంకుల సౌజన్యంతో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు ఉరుకూటి చందు, పల్లా శ్రీనివాసరావు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.



రక్తదానం చేస్తున్న యువకులు

పదవీ విరమణ పొందిన ఉద్యోగులకు సత్కారం

అగనంపూడి: ఒకవైపు ఉద్యోగ విధులు నిర్వహిస్తూనే, మరోవైపు సామాజిక సేవా కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొన్న ముగ్గురు ఉక్కు అధికారులను వారి ఉద్యోగ విరమణ సందర్భంగా ప్రజా సంఘాలు గురువారం ఘనంగా సత్కరించాయి. అగనంపూడిలోని సీడబ్ల్యూసీలో అగనంపూడి సర్వహిత చారిటబుల్ ట్రస్ట్, పిళ్లా వరహా వెంకట లక్ష్మి సేవా ట్రస్ట్‌ల సంయుక్త సౌజన్యంతో నిర్వహించిన కార్యక్రమంలో ఉక్కు అధికారులు ఎం. ఉమామహేశ్వరరావు, జామి గణేష్, పి.వెంకటరావులను ఘనంగా సత్కరించారు. సర్వహిత చారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపకులు గుదే సుశీలా గజేంద్రరావు, సలహాదారు పట్టా రామ అప్పారావు మాట్లాడారు. కార్యక్రమంలో పిళ్లా శ్రీనివాస్, ఐఆర్‌సీహెచ్ అప్పారావు, ఎం. నరసింగరావు, విందుల వరహాలు, ట్రస్ట్ ప్రతినిధులు పాల్గొన్నారు.



పదవీ విరమణ పొందిన ఉక్కు ఉద్యోగులను సత్కరిస్తున్న ప్రజా సంఘాల నేతలు